క్లుప్తంగా

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం

సత్తెనపల్లి: నెల్లూరు ఏపీ పీపీడీ జోన్–3 పరిధిలోని వివిధ బస్ స్టేషన్లు, బస్సు డిపోల్లో ఖాళీగా ఉన్న 26 ప్రదేశాలను 15 సంవత్సరాలకు లీజు పద్ధతిలో అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మధు మంగళవారం తెలిపారు. సత్తెనపల్లి బస్టాండ్‌లో 2 వేల చదరపు గజాలు, అచ్చంపేట బస్ స్టేషన్ పరిధిలో 1,597 చదరపు గజాలు, అమరాతి (బీట్–1) బస్సు స్టేషన్ పరిధిలో 3,872 చదరపు గజాలు, అమరావతి (బీట్–2) బస్సు స్టేషన్ పరిధిలో 6,582 చదరపు గజాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లా ప్రజా రవాణా అధికారి నరసరావుపేట కార్యాలయంలో ఈ నెల 23న ఉదయం 11 గంటలకు దీనిపై అవగాహన సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9959225429 నంబరులో సంప్రదించాలని కోరారు.

చిన్నారులకు యోగ, ధ్యానంపై శిక్షణ



క్రోసూరు: వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం చిన్నారులకు యోగ, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, నీతి కథలు చెప్పటం, రాయటం, పుస్తక పఠనం, చెస్, క్యారమ్స్, స్కిప్పింగ్ వంటి ఆటలు నేర్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు గ్రంథాలయ అధికారి తెలిపారు. విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలకు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

సొంత ఖర్చులతో వైద్యం చేయించిన డాక్టర్ గజ్జల

రాజుపాలెం: మండలంలోని కొత్తబోధనంకు చెందిన మాదాసు నాగార్జునపై గత ఎనిమిది నెలల క్రితం టీడీపీకి చెందిన గూండాలు దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో నాగార్జున నోటిలోని ఆరు పళ్లు దెబ్బతిన్నాయి. దీంతో సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి తన సొంత ఖర్చులతో విరిగిపోయిన పళ్ల స్థానంలో కొత్త పళ్లు ఏర్పాటు చేశారు. నాగార్జున డాక్టర్ గజ్జలకు కృతజ్ఞతలు తెలిపాడు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



దాచేపల్లి: వినియోగదారులకు నాణ్యమైన కరెంట్ ఇచ్చేందుకు కృషి చేయాలని విశ్రాంత సెషన్స్ జడ్జి ఎస్. విక్టర్ ఇమ్మానియేల్ కోరారు. స్థానిక విజయభాస్కర్ కల్యాణ మండపంలో విద్యుత్ అదాలత్, వినియోగదారులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సమస్యలపై వినియోగదారులు పది అర్జీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యుత్‌ని సరఫరా చేసి వినియోగదారుల మన్నలను పొందాలని, విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుంచి వినతిపత్రాలు వచ్చినప్పుడు తక్షణమే స్పందించాలని సూచించారు. సదస్సులో సాంకేతిక కమిటీ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఎ.సునీత, పల్నాడు జిల్లా ఎస్ఈ పి.విజయ్‌కుమార్, ఈఈ నూతలపాటి సింగయ్య, ఏడీఈ వీరేశ్వరరావు, ఏఈలు భగవాన్ నాయక్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనుల పండువగా శాంతి కల్యాణోత్సవం



రెంటచింతల: స్థానిక మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం) వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు వెల్లటూరి నాగేశ్వరశర్మ నేతృత్వంలో ఉదయం స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, 10 గంటలకు లక్ష మల్లెలార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. 11 గంటలకు స్వామివార్ల శాంతి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. మధ్యాహ్నం మంత్రపుష్పం, మంగళ హారతి కార్యక్రమాలను నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం అధ్యక్షులు పల్లెర్ల లక్ష్మారెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ కె.సరోజినిదేవి పాల్గొని భగవద్గీత బంగారు పతకం పొందిన అమరనేని రమాదేవినిదు శ్యాలవతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుండా రామ్మూర్తి, యేచూరి కేదర్‌నాథ్, సైదారెడ్డి, సైదులు, యేచూరి నర్సింహారావు పాల్గొన్నారు.

కన్నారా.. కాలనీ సమస్యలు..!?

- కాలనీలో ఇళ్ల మధ్య పెరిగిన కంప చెట్లు
- దీంతో పాములు, పురుగుల సంచారం
- గుంతల రోడ్లు, లేని ప్రాథమిక పాఠశాల
- సైడు డ్రైన్లు లేక రోడ్ల పైనే మురుగు నీరు

సమస్యలతో సతమతమవుతున్న క్రోసూరులోని కన్నా కాలనీ



సైడు డ్రైన్లు లేక రోడ్డుపైనే పారుతున్న మురుగు



ఇళ్ల మధ్య కంప చెట్లతో క్రోసూరులోని కన్నా కాలనీ

క్రోసూరు : మండల కేంద్రమైన క్రోసూరులో 17 సంవత్సరాల క్రితం ఏర్పడిన కన్నా కాలనీలో ప్రజలు అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ పాలనలో మైనార్టీ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వటం జరిగింది. క్రోసూరు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే కన్నా కాలనీలో చాలా మంది ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారు. ఇక్కడ దాదాపు 150 దాకా ఇళ్లు ఉంటాయి. 300–400 జనాభా నివసిస్తున్నారు. కానీ పంచాయతీ కాలనీ అభివృద్ధికి మాత్రం నిర్లక్ష్యం వహించింది.

- కాలనీ మధ్యలో ఇళ్ల ప్లాట్లలో ఎక్కడ చూసినా ముళ్ల, కంప, పిచ్చి చెట్లు, గుంతల మయంగా మట్టి రోడ్లు, అడ్డదిడ్డంగా వీధులు ఉన్నాయి.
- కాలనీలో కనీసం ప్రాథమిక పాఠశాల గానీ, మినీ అంగన్‌వాడీ కేంద్రం గానీ లేదు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఎన్నికలు వచ్చినపుడు నేతలు ప్రజలకు అన్నీ చేస్తామని చెప్పటమే గానీ ఏమీ చేయటం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు.
- కాలనీల్లో సీసీ రోడ్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా నిర్మిస్తున్నప్పటికీ కన్నా కాలనీ మాత్రం సీసీ రోడ్లకు కూడా నోచుకోలేదు. పిచ్చిచెట్లు పెరిగిపోవటంతో పాములు, పురుగులు తిరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. వర్షాలు పడితే రోడ్లపై నడిచేందుకు కూడా వీలుపడని పరిస్థితి.
- దీనికి తోడు 2024 కల్లా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి అన్న ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ కనీసం కాలనీ వైపు పైపు లైన్లు కూడా వేయలేదు. దీంతో బయట నుంచి నీళ్లు మోసుకుని తెచ్చుకోవాల్సిందే. రెండు కిలోమీటర్ల దూరంలోని క్రోసూరుకు సాగర్ జలాలు అందుతున్నా ఇక్కడి ప్రజలు మాత్రం బోర్లు, బజారు కుళాయిలపైనే ఆధారపడి జీవిస్తున్నారు.
- సైడు డ్రైన్లు లేక మురుగు నీరు పారే దారి లేక రోడ్లపై పారుతున్నాయి. దీంతో దోమలు ఉధృతి తీవ్రంగా ఉంటుందని, ఏ రోగాలు వస్తాయోనని కాలనీ వాసులు భయపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు కన్నా కాలనీ ప్రజల సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రోడ్లు, సైడు డ్రైన్లు లేవు



కాలనీలో సరియైన రోడ్లు లేవు, సైడు డ్రైన్లు లేవు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నో సార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదు.

– హిందాతుల్లా, కన్నాకాలనీ, క్రోసూరు

పాములు తిరుగుతున్నాయి



కాలనీలో ఖాళీ స్థలాల్లో, వీధుల్లో పిచ్చిచెట్లు బాగా పెరిగిపోయాయి. దీంతో పాములు, పురుగులు రాత్రి సమయంలో తిరుగుతున్నాయి. పంచాయతీ అధికారులకు చాలా సార్లు చెప్పాం. కానీ తొలగించలేదు.

– షేక్ మస్తాన్‌వలి, కన్నాకాలనీ, క్రోసూరు

ఇంటింటికీ కుళాయి అన్నారు



ఇంటింటికీ కుళాయి ఇస్తామన్నారు. ఇంత వరకు కాలనీకి పైపు లైన్లు కూడా వేయలేదు. ఇంటింటికీ కుళాయి ఉంటే నీళ్లు బయట నుంచి తెచ్చుకునే పని ఉండదు.

– సాహిరాబేగం, కన్నాకాలనీ, క్రోసూరు

కూటమి ప్రభుత్వం వాగ్దానాలను తక్షణం అమలు చేయాలి

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు

అమరావతి: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణం అమలు చేయాలని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో సీపీఐ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి ఎ.నాంచారయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ దేశం వెలిగిపోతుందని.. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పన.. రైతాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని నమ్మబలికి గద్దెనెక్కిన మోదీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతాంగం, కార్మికులు, వ్యవసాయ కూలీలు, మధ్య తరగతి ప్రజలు తదితర వర్గాల సమస్యలు పరిష్కారం చేసే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. దేశ సంపద సృష్టికర్తలైన కార్మికులు, కర్షకులు పేదరికాన్ని అనుభవిస్తుంటే దేశ సంపదను కార్పొరేట్లకు పంచిపెట్టి మత మారణ హోమం సృష్టిస్తూ ఇదే దేశాభివృద్ధి అని నమ్మబలుకుతున్న ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజలంతా ఎండగట్టాలన్నారు. ఈ సమావేశంలో మండల సీపీఐ కార్యాదర్శి కారంపూడి చెన్నకేశవరావు, టి.వెంకటేశ్వర్లు, కె.ఎసు, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు

గైర్హాజరయిన ఎంపీ, ఎమ్మెల్యే



సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు మొక్కుబడిగా సాగింది. మిని మహానాడుకు స్థానిక శాసనభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు గైర్హాజరయ్యారు. కేవలం పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్, నియోజకవర్గ పరిశీలకుడు తాతా జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన నేతలు మాత్రమే వేదికపై ఉన్నారని, ఆ పార్టీ నేతలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ సైతం కొద్దిసేపు ఉండి వెళ్లిపోయారని, మినీ మహానాడు మొక్కుబడిగా సాగిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి.

28న ఎరువుల వేలం

ఏడీఏ వి.హనుమంతరావు

క్రోసూరు: క్రోసూరు మార్కెట్‌యార్డులోని అగ్రి ల్యాబ్‌లో పరీక్షించబడిన నాణ్యమైన ఎరువులను ఈ నెల 28వ తేదీన వేలం వేస్తున్నట్లు ఏడీఏ వి.హనుమంతరావు మంగళవారం తెలిపారు. 60.600 కిలోల యూరియా, కాంప్లెక్స్ ఎరువులను వేలం వేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఏడీఏ కోరారు.

నిస్వార్థపరుడు ఏపీ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు నిస్వార్థ పరుడని బ్రాహ్మణ సేవా సంఘ నాయకులు కొనియాడారు. పట్టణంలో మంగళవారం ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం పంతులు నిష్పక్షపాతంగా ప్రజల కోసం నిరంతరం త్యాగం చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. సత్కారం కంటే రెండు అరటిపళ్లు ఇస్తే చాలనే వారని, అధికారం కోసం, పదవి కోసం తాపత్రయం ఆయనకు ఉండేది కాదని, తన ఆస్తులను సైతం ప్రజా సంక్షేమం, పేదలను ఆదుకునేందుకు ఖర్చు చేశారని గుర్తు చేశారు. అటువంటి నిస్వార్థ నాయకుడు మళ్లీ పుట్టరని, టంగుటూరి వర్ధంతి, జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జరుపుకోవాలన, ప్రభుత్వం ఆయా దినాలను సెలవుగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సత్తెనపల్లి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పీసపాటి హనుమంతరావు, మేడేపల్లి నరేంద్రకుమార్, ఉన్నవ పూర్ణచంద్ర ప్రసాదరావు, బండారుపల్లి రఘు తదితరులు ఉన్నారు.

బాలికలను స్వేచ్ఛగా బతకనిద్దాం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ప్రమీల

సత్తెనపల్లి: బాలికలను స్వేచ్ఛగా బతకనిద్దామని సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ టి.ప్రమీల అన్నారు. కిశోరి వికాసంలో భాగంగా పట్టణంలోని 30వ వార్డులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ బాలికలపై లింగ వివక్ష చూపకూడదన్నారు. కుటుంబంలో బాలికలను ఒకరకంగా, బాలురను మరోరకంగా చూడకూడదన్నారు. బాలబాలికలిద్దరని సమానంగా చూడాలన్నారు. కడుపులో బాలిక అని తెలియగానే చంపకూడదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.నాగమణి, ఎం.మార్తమ్మ, ఎం.వెంకటరమణ, కిశోరి బాలికలు, తదితరులు ఉన్నారు.

బాలికల పట్ల వివక్ష తగదు

క్రోసూరు/దొడ్లేరు: మండలంలోని క్రోసూరు, దొడ్లేరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ మాధవి, దొడ్లేరు సెక్టార్ సూపర్‌వైజర్ రత్నకుమారి పాల్గొని బాలికల పట్ల లింగ వివక్ష, అసమానతలను తొలగించాలంటూ అవగాహన కల్పించారు. బాలికలను బాలురతో సమానంగా చదివించటం, మంచి భవిషత్ కోసం ప్రోత్సహించటం చేయాలన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆయా సెక్టార్ల అంగన్‌వాడీ వర్కర్లు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బొల్లవరంలో కిశోరి వికాసం కార్యక్రమం

బొల్లవరం(ముప్పాళ్ళ): ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ పరిధిలో ఇరుకుపాలెం సెక్టార్ పరిధిలోని బొల్లవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో డీసీపీవో యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రశాంత్, అవుట్ రీచ్ వర్కర్ నానమ్మలు పాల్గొని లింగ వివక్ష, అసమానతల గురించి కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి రమ్యకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల సమగ్ర అభివృద్ధికే కిశోరి వికాసం

అచ్చంపేట: కౌమర దశలో ఉన్న బాలికల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కిశోరి వికాసం కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.మాణిక్యం అన్నారు. మండలంలోని చెరుకుంపాలెంలో మంగళవారం జరిగిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, రుతుక్రమం, బాల్య వివాహాలు, యుక్తవయస్సు సమస్యలపై అవగాహన కల్పించారు. అలాగే విద్య ప్రాముఖ్యతను వివరించారు. బాలికలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయడం, పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణాలమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, వీవోఏలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.



క్రోసూరులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు



బొల్లవరంలోని కిశోరి వికాసం కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రశాంత్



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం

ముద్దాయిలు సత్ప్రవర్తనతో జీవించాలి

జిల్లా న్యాయ సేవాధికార కమిటీ కార్యదర్శి జియావుద్దీన్



సబ్ జైలులో నిత్యావసరాలు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్

సత్తెనపల్లి: ముద్దాయిలు సత్ప్రవర్తనతో జీవించాలని గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార కమిటీ కార్యదర్శి జియావుద్దీన్ అన్నారు. సత్తెనపల్లిలోని ఉపకారాగారాన్ని మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార కమిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జియావుద్దీన్ సందర్శించారు. ముందుగా ఉపకారాగారంలోని పరిసరాలను, ముద్దాయిలకు అందుతున్న ఆహార పదార్థాలు, ముడిసరుకుల నాణ్యత పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. అక్కడ ఉన్న ముద్దాయిలకు అందుతున్న సౌకర్యాలను ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి జియావుద్దీన్ మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేని వారికి ప్రభుత్వం న్యాయ సహాయం అందించేందుకు న్యాయవాదిని ఉచితంగా నియమిస్తుందన్నారు. బెయిల్ పిటిషన్ వేసుకునే ఆర్థిక స్థోమత లేని కొందరు ముద్దాయిల కేసు విత్‌డ్రా, వారు ఎన్నిరోజులుగా రిమాండ్ ముద్దాయిలుగా ఉంటున్నారనే వివరాలు అడిగి తెలుసుకోవడమే కాక, వారికి న్యాయ స్థానమే ఉచితంగా ప్రభుత్వ న్యాయ సహాయ న్యాయవాదిని నియమిస్తుందన్నారు. న్యాయమూర్తితోపాటు, ప్యానల్ న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, సబ్ డివిజన్ సూపరింటెండెంట్ వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా రాజవరపు



సత్తెనపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా సత్తెనపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది రాజవరపు శివనాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రాజగొల్ల రమేష్‌యాదవ్, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డికి శివనాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శివనాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 139 బీసీ కులాలను ఏకం చేసి, 2029లో జరుగబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడానికి బీసీలను ఒకతాటి పైకి తీసుకొచ్చేలా కృషి చేస్తానన్నారు. బీసీ కులాల హక్కుల కోసం పనిచేస్తానన్నారు. శివనాగేశ్వరరావు నియామకం పట్ల పార్టీ లీగల్ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు రోళ్ల మాధవి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మారూరీ లింగారెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ నాయకులు సందెపోగు గాంధీ అభినందనలు తెలిపారు.

మిర్చి, పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



వీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

నకరికల్లు: మిర్చి, పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు జి.పిచ్చారావు డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడంపై మండలంలోని చేజర్ల గ్రామ సచివాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయం పట్ల ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిచ్చారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు రైతులు అమ్ముకున్న ధరకు మధ్య వ్యత్యాసాన్ని తేల్చి రైతులకు చెల్లించాలన్నారు. ఈ క్రాప్ ఆధారంగా మిర్చి రైతులకు రూ.5 వేలు బోనస్ ఇవ్వాలన్నారు. కౌలు రైతులను గుర్తించాలని, అన్నదాత సుఖీభవ రూ.20 వేలు ఒకేసారి రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిదినాలు పెంచాలని, పెండింగ్ వేతనాలు సత్వరమే చెల్లించాలని, అలవెన్సులు ఇవ్వడంతో పాటు అవినీతిని అరికట్టాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలను స్పష్టంగా ప్రకటించాలన్నారు. బర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలను మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో చట్టు కోటేశ్వరరావు, ఆర్.వెంకయ్య, ఎస్.రామాంజినాయక్, బి.సోమ్లానాయక్, కోటేశ్వరమ్మ బాయి తదితరులు పాల్గొన్నారు.

దేవుని విగ్రహాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సత్తెనపల్లి: శ్రీకాకుళం జిల్లాలో ఏడు దేవుని విగ్రహాలు ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్ఎస్ ఖండ సంఘ చాలక్, సీనియర్ న్యాయవాది చలువాది చిన సత్యనారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలోని కోటమ్మ సత్రంలో మంగళవారం జరిగిన సత్తెనపల్లి, పెదకూరపాడు ఆర్‌ఎస్ఎస్ ఖండ సంఘ చాలక్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలోని గార మండలం, కళింగపట్నం పెదపల్లిపేటలోని కోదండ రామాలయంలో బాల శశి శేఖర్ (వైష్ణవ ఆలయం) గుర్తు తెలియని వ్యక్తులు ఏడు విగ్రహాలు ధ్వంసం చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాలకు, దేవతామూర్తుల విగ్రహాలకు తగిన రక్షణ కల్పించాలన్నారు. ప్రభుత్వం దేవాలయాలను కేవలం ఆదాయ వనరులుగా చూస్తోందని, వాటికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు దివ్వెల శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, కొర్రప్రోలు నగరీనారాయణ, శివకుమార్, అన్నం వెంకటరమణ, పెండ్యాల హరేరామ్, పోతుగడ్డ కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

బహుజన వాదాన్ని వినిపిస్తున్న యోధుడు కొరబండి



ఆంథోనిని సత్కరించిన ప్రజా సంఘాల నాయకులు

సత్తెనపల్లి: ఓ పక్క ఆర్టీసీ అధికారిగా పనిచేస్తూనే మరో పక్క తన కవితలతో సామాజిక రుగ్మతలపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూ బహుజన వాదాన్ని రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తున్న యోధుడు కొరబండి ఆంథోని అని విశ్రాంత డీఎస్పీ గంటెల రవికుమార్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కత్తి పద్మారావు ప్రధాన అనుచరుడిగా, దళిత మహాసభ ఉపాధ్యక్షుడిగా ఎన్నో సామాజిక ఉద్యమాలను తనదైన శైలిలో కొరబండి చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళిత, బహుజన వర్గాల సమస్యలపై పాలకులను నేటికీ ప్రశ్నిస్తూ దళితులకు అండగా నిలుస్తున్నారన్నారు. అరండల్‌పేట సీఐ కొరబండి ఆరోగ్యరాజు, న్యాయవాదులు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, జొన్నలగడ్డ విజయకుమార్, సయ్యద్ అబ్దుల్ రహీం, పెండెం బాబూరావు, గాదెవరపు శివనాగేశ్వరరావు, మాదంశెట్టి వేదాద్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు కె.బి.ఆర్.జె.ప్రసాద్, లక్ష్మీనారాయణ, మాతంగి సాంబశివరావులు మాట్లాడారు. అనంతరం కొరబండి ఆంథోని, విజయలక్ష్మి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జిల్లెళ్ల పాల్‌రాజ్, షేక్ మస్తాన్‌వలి, హైదర్, చాంద్‌బాషా, ఎన్.పి.ప్రసాద్, గొట్టిముక్కల కిషోర్, జడా ప్రసాద్, జెట్టి శేఖర్, కొరబండి రాంబాబు, స్వాతి, నలబోలు రాజా ఉన్నారు.

యోగాంధ్ర లాంచింగ్‌లో పాల్గొనండి

ఎంపీడీవో పార్వతి

అమరావతి: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక బుద్ధ విగ్రహం ఎదురుగా ఉన్న యోగ ప్రాంగణంలో బుధవారం యోగాంధ్ర లాంచింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పార్వతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే యోగాంధ్ర లాంచింగ్ కార్యక్రమంలో అన్ని గ్రామాల మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, పరిషత్ కార్యాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

• నేడు యోగాపై అవగాహన

రెంటచింతల: ప్రిపేర్‌నెస్ టు యోగ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక సెయింట్ జోసఫ్స్ పాఠశాల ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సరోజినిదేవి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.